# ఆదర్శమా వర్ధిల్లు

పి.వి.శేషారత్నం

## "సాధనా !"

"వూఁ..."— చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తకుండానే వూ కొట్టింది సాధన.

విప్పిన షర్టును వంకీకి తగిలిస్తూ అన్నాడు చైతన్య -- "అనంత్ ఇంతలా మారిపోతా డను కున్నామా మనం?"

"అంటే మీ ఉద్దేశం?" సీరియస్‌గా అడిగింది సాధన, పుస్తకం మూసేసి టేబిల్ మీద పడేస్తూ.

సాధన కంత కోపం వస్తుందని వూహించని చైతన్యకు పాలమారింది—ఆ కంఠంలోని సీరియస్ నెస్‌కు.

వినుపోతూ "అదే ... అనంత్ కట్నాని కంత పేచీ పెడతాడని ... పైగా ముహూర్తం అదీ నిర్ణయమైపోయి, శుభలేఖలు అచ్చయ్యాక ..."

"ఏమిటి మీ రనేది ... వాడు కట్నం తీసుకోవ డానికి తగడనా మీ రనేది? వాడూ మగాడే. పైగా ఆఫీసరు. కట్నం అడిగితే కొంప మునుకుపోయిం దేముంది?"

"సాధనా!" నోట్లో మాట నోట్లోనే ఉండి పోయింది చైతన్యకు—విపరీతమైన ఆశ్చర్యంతో.

"నువ్వు ... నువ్వేనా మాట్లాడుతున్నది. నువ్వు కట్నాన్ని సమర్థిస్తున్నావా? నేను కలగంటున్నానా. లేక ..."

"అవును నేనే మాట్లాడుతున్నాను—సాధననే!"

చైతన్యకు మతిపోయింది. ఇదేమిటి ... ఇలా అయింది!

కట్నం పేరు వింటే పగబట్టిన త్రాచులా బుస్సున లేచే సాధన కట్నాన్ని సమర్థిస్తోందా?

సాధనను తను ఏరి కోరి చేసుకున్నది ఆ విశిష్ట మైన వ్యక్తిత్వాన్ని, పట్టుదలను, నిజాయితీని చూసేగా. అందమైన ఆ చిన్ని పెదవులు తన పట్టు దలను సూచిస్తాయి. చిన్నవైనా నిశితమైన ఆ కళ్ళు చురుగ్గా దేన్నో పరిశీలిస్తున్న ట్లుంటాయి.

అతని కళ్ళముందు ఆ నాటి దృశ్యం కదలాడింది. పొందికగానే కూర్చున్న ఆ పెళ్ళి కూతురులో బలవంతాన కూర్చున్న అసహనం చూసి నవ్వు కున్నాడు.

సాధనకు, తనకు ఎక్కువ పరిచయం లేకపోయినా సాధన గురించి తనకు బాగా తెలుసు. సుబ్బారావు చెల్లెలి ఫ్రెండ్ సాధన. ఆ అమ్మాయి దగ్గర చాలా వివరాలే సేకరించాడు సాధన గురించి. ముఖాముఖి మాట్లాడుకోవడం పెళ్ళి చూపులలోనే.

తను పెళ్ళికూతురుతో విడిగా మాట్లాడతా నంటే వాళ్ళెవరూ అభ్యంతరపెట్టలేదు. అభ్యుదయ భావాలున్న మనుషులు అనుకున్నాడు తను. సాధనకి తనకి జరిగిన సంభాషణ తలచుకుంటే నవ్వువస్తుంది.

"మీరు ... మీ పేరు సాధన కూడూ!"

"వూఁ..." బలవంతాన తెచ్చి పెట్టుకున్న సహనం కన్పిస్తోంది.

అంతదగ్గరగా ఆమెను చూస్తూంటే అదోరక మైన అనుభూతి, ఉద్వేగం. ఆమె చేతిని తనచేతిలోకి తీసుకోవాలనిపించింది. కాని ... ఆ మూతి ఓగింపు చూస్తుంటే సాహసించలేక పోయాడు తను.

"నేను నచ్చానా మీకు?"

"ముందు మే మివ్వబోయే కట్నం నచ్చాలిగా మీకు?" నాగినిలా తలెత్తింది.

"కట్నమా?" దెబ్బతిన్నట్టు చూశాడు తను.

"కట్నం పేరు తెలియని అమాయకుల్లా నటించకండి. మీ మగాళ్ళ కిదంతా మామూలేగా— ఎదురుగా ఇచ్చకపు మాటలు చెప్పడం, కట్నం బేరం కుదరకపోయేసరికి ఇంటికి వెళ్ళి ఉత్తరం వ్రాస్తా మనడం. ఎవరికి తెలియనివి?" ఆ, చెప్పడంలో తొణుకూ బెణుకూ లేదు.

అస లామె అలా మాట్లాడుతుందని వూహించ లేదు. సిగ్గుపడుతుం దనుకున్న పెళ్ళి కూతురు తలెత్తి ధీమాగా తనని నిలదీస్తూంటే?

"ఇంతకీ మీ కోపం మగాళ్ళమీదా? కట్నం మీదా?"

"కట్నం తీసుకునే మగధీరులంటే నా కసహ్యం."

"చూడండి నే నడిగింది మీకు నచ్చానా అని?

"నేను చెప్పేది కూడ ..."

"ఆగండి! ఇక్కడ ఎవరిమీద విరుచుకు పడ తారు? నేను కట్నం తీసుకోబోవడం లేదు."

"వ్వాట్."

"ఏం! కట్నం ఇవ్వకూడనే ఆదర్శం మీ ఒక్కరికే గాని కట్నం తీసుకోకూడదని మాకుండకూడదా?"

"నిజంగా అంటున్నారా? లేక ..."

"మీరు ఉత్తుత్తినే కూడ మాట్లాడుతున్నా రన్న మాట నిజంగా కాకుండా. కానీ నా కలాంటి అలవాటు లేదు లెండి."

ఈ సారి తల దించుకొంది. ఈ సారి ఆమె కళ్ళలో అపనమ్మకం బదులు ఆశ్చర్యం కనిపించింది.

"ఇప్పుడు కోపం పోయిందా మీకు. ఇంకా మీకేమైనా ఆదర్శాలుంటే చెప్పండి. అవన్నీ ఒప్పుకునే మిమ్మల్ని చేసుకుంటాను."

సిగ్గుల మొగ్గే అయింది సాధన.

"సాధనా!" ఆర్ద్రంగా పిలిచాడు తను.

"నువ్వంటే నాకు చాలా ఇష్టం తెలుసా? మీ ఫ్రెండ్ ఎప్పుడూ చెప్పలేదూ! కట్నం అంటే నీకే కాదు నాకూ అయిష్టమే. అయినా ఇంత అందాన్ని మించిన కట్నం ఎక్కడైనా ఉంటుందా ఈ భూ ప్రపంచంలో. ఒప్పుకో, సాధనా!"

తలెత్తలే దామె. అయినా ఆ మౌనమే ఎన్నో సందేశా లందించింది తనకు. ఆ మధుర దృశ్యం క్షణంసేపు కదలాడి పెదాలపై చిరునవ్వు కదలా డింది.

పెళ్ళయ్యాక కూడ తన స్నేహితు లెవరైనా కట్నం తీసుకుంటున్నారని తెలిస్తే నిర్మొహమాటంగా బల్లగుద్ది మరీ వాదించేది. అటు వాళ్ళ అవస్థ ఇటు సాధన ఆవేశం చూసి ముగ్ధుడయేవాడు తను.

అలాంటి సాధన ఇప్పుడు తమ్ముడి విషయం వచ్చేసరికి కట్నాన్ని సమర్థిస్తోందంటే నమ్మలేక పోతున్నాడు. ఆ ఆవేశం ఏమైంది?

సరిగ్గా ఇదే సమయంలో సాధన కళ్ళముందు కూడ అదే దృశ్యం కదలాడింది. అయితే ఆమెకు నవ్వు, మధురోహలు రాలేదు. పట్టరాని ఆగ్రహం, రోషం, ఆవేశం ముంచు కొచ్చాయి?

తియ్యటి కబుర్లు చెప్పి ఎంత అందంగా మోసం చేశాడు చైతన్య. అబద్ధాలాడే వాళ్ళంటే విపరీత మైన అసహ్యం తనకు. అతని మోసం గ్రహించలేక, ఆదర్శవంతుడైన భర్త లభించాడని ఎంత మురిసి పోయింది? స్నేహితురాళ్ళతో ఎంత గర్వంగా తలెత్తి చెప్పుకుంది.

అందం, మంచితనం, ఆస్తి—అన్ని ఉన్న వాడు దొరికిన తన అదృష్టానికి ఫ్రెండ్స్ అసూయ పడుతూంటే ఎంత ఆనందించింది తను?

కానీ, నిలువునా నమ్మించి మోసం చేశాడు తనని అబద్ధం ఎందుకు చెప్పాలి?

కట్నమే ముఖ్యమైతే తన నెందుకు వంచించాలి? తనకి పెళ్ళికొడుకులు దొరకరా? కట్నం తీసుకోని వాడు దొరికేదాకా పెళ్ళి చేసుకునేదే కాదు తాను.

ఈ సంగతి తన కెప్పటికీ తెలిసేదే కాదు—శ్యామల నిగ్గదీసి అడక్కపోతే. తనెంత అవమానం పొందింది? అమ్మ ... అమ్మగాని, నాన్నగాని తనతో ఒక్కమాట కూడ ఎందుకు చెప్పలేదు.

ఆ మధ్య పుట్టింటికి వెళ్ళినప్పుడు అదే మాట అడిగింది అమ్మను.

"పోనీ, సాధనా! కట్నం తీసుకున్నా అంత మంచి వాడు దొరకద్దూ?"

అమ్మ అలా అన్నా, ఆ పదివేలకి వాళ్ళెన్ని అవస్థలు పడ్డారో త నూహించగలదు. అనంత్ చదువు ఆఖరి సంవత్సరాని కొచ్చింది. వాడికి ప్రతీ నెలా బోలెడు డబ్బు పంపాలి. ఈ సంబంధం రాకపోతే అప్పట్లో తన పెళ్ళి చేసేవారే కాదు. తమ్ముడి చదువయ్యాక చేసేవారు.

తల్చుకున్న కొద్దీ మండిపోతోంది సాధనకు.

"శుభలేఖలు కూడా పంపేశాక మీ మామగారు మధ్యవర్తితో కబురు చేశాడే, సాధనా 'పదివేలిస్తేగాని పెళ్ళవదు. అసలు వాడికి ఇరవై వేలదాకా ఆఫర్లు వచ్చాయి. వాడు మీ అమ్మాయంటే మోజుపడు

తున్నాడు కనుక పదివేలకు దిగాం' అంటూ. మీనాన్న గారికీ, నాకూ కళ్ళూ ఛేతులూ ఆడలేదు. సమయానికి ఏదో ఇల్లుండబట్టి సరిపోయింది—అప్పు తీసుకోవడానికైనా. లేకపోతే నలుగురిలో అప్రతిష్ఠ పాలయ్యేవాళ్ళం. అదు నా సంపాదనంతా మనసులో పెట్టుకోకు. అయిపోయిం దేదో అయిపోయిందిగా. నువ్వు మీ ఆయనతో గొడవ పెట్టుకోనని మాటియ్యి'' అంటూ ఒట్టు వేయించుకుంది అమ్మ. లేకపోతే తిరిగి రాగానే దులిపేసేదే.

అప్పట్నుంచే తెలియని కక్ష ప్రవేశించింది తనలో. ఎలాగైనా వాళ్ళూ ఇలాంటి పరిస్థితి నెదుర్కొనేలా చేస్తే తప్ప తన పగ చల్లారదు.

అనంత్ తామంటున్న వూరికీ ట్రైనింగు కొచ్చేసరికి మెరుపు మెరిసింది తనలో. ఆడబడుచు నిర్మలకీ, అనంతకీ చనువు పెరగ నివ్వాలి. అప్పుడు మొదలవుతుంది కథ.

అనుకున్నట్టే నిర్మల, అనంత్ దగ్గరయారు, ట్రైనింగు మూడు నెలల్లోను. అత్తగారికి, చైతన్యకు కూడ వాళ్ళు చిలకా గోరింకల్లా కనిపించసాగారు. దానిని మూడు ముళ్ళ బంధంతో శాశ్వతం చెయ్యాలనుకుని తన దగ్గర కదిపారు.

అప్పుడు చెప్పింది అనంత్‌కి తను. అక్కా తమ్ముళ్ళ మధ్య రహస్యాలేమీ లేవు చిన్నప్పట్నుంచీ. మొదట్లో నిర్మల మీద అభిమానంతో కొంచెం వెనుకాడినా తన ప్లానుని ఒప్పుకున్నాడు అనంత్.


జరుగుతున్న నాటకం చూస్తూ కూర్చుంది తను.

అత్తగారు కట్నం విషయం ఎత్తబోతే, మనలో మనకి కట్నాలేమిటి లెండి అని ఎగరకొట్టేసింది తను. దానితో వాళ్ళు అమ్మ నాన్నలతో మాట్లాడినా కట్నం విషయం మాట్లాడుకోలేదు. అనంత్ బాగానే నటిస్తున్నా డన్న మాట. ఇవాళ కబురుచేసి, ఉంటాడు — పాతికవేలు కట్నమిస్తే తప్ప పెళ్ళి చేసుకోనని.

అత్తగారు, మావగారు, ఆయన కంగుతిన్నట్టున్నారు.

''ఏం సాధనా మాట్లాడవ్?'' చైతన్య ప్రశ్నతో వర్తమానంలోకి వచ్చింది సాధన.

''నేను మాట్లాడే దేముంది? పెళ్ళి చేసుకోబోయేది వాడు. చేసేది మీరు. అయినా ఆదర్శాలకేం లెండి. అందరికీ ఉంటాయి. ఆచరణలో కొచ్చేసరికి దాక్కుంటాయి.'' పొరగా చూసింది అత్తగారివైపు.




ఆవిడ తేలుకుట్టిన దొంగలా వంటింట్లోకి జారుకుంది.

నిర్మల! నిర్మల కళ్ళలో నీళ్ళు చూసేసరికి 'తను తప్పు చేస్తున్నానా? అనిపించింది సాధనకు. ఎన్ని కలలు కంటోందో పిచ్చిపిల్ల? కానీ, తన తల్లీదండ్రీ గుర్తొచ్చేసరికి కఠినమైపోయింది ఆమె మనసు.

'తనదాకా వస్తేగాని తెలియదన్న మాట' —దిగాలుగా తలపట్టు క్కూర్చున్న మామగారిని చూసి అనుకుంది సాధన.

సాధన ధోరణి కోపం తెప్పించింది చైతన్యకు.

''ఏమిటి నువ్వనేది?''

''నే నేమంటాను. మా అనంత్ దేం తప్పులేదు. మీలాగా వాడూ ఆదర్శాలు వల్లించాడు. ఆచరణలో వాడికీ కట్నం ...''

"ఆగు! ఏమిటి నేను ఆదర్శాలు వల్లించానా?"

"అంతేకాదు. అందంగా మోసం చేశారు కూడా."

కోపం కట్టలు తెంచుకుంది చైతన్యలో.

"సాధనా!" 'హాలు దద్దరిల్లిపోయింది అరుపుతో.

"మీరు గొంతు చించుకుంటే నేనేం భయపడను. సిగ్గులేకుండా పైగా మాటలు." 'తల్లికిచ్చిన మాట గంగలో కలిపేసింది సాధన.

"అంటే ... అంటే నువ్వు నాకు కట్నం ఇచ్చే చేసుకున్నావా?"

"ఆహా సలక్షణంగా కొనుక్కున్నాను. ఏం తెలియనట్టు పైగా నాటకం, నా కళ్ళు ఇంకా ఎంతకాలం కప్పుదా మనుకుంటున్నారు." హఠాత్తుగా దుఃఖం ముంచుకొచ్చింది సాధనకు.

"ఎంత గర్వపడ్డాను? నా ఆదర్శం నెరవేరిందని విర్రవీగాను. మీరు ... మీరు నా గర్వం బాగా అణిచారు. మీరు చేసిన మోసానికి భగవంతుడుకూడా మిమ్మల్ని క్షమించడు."

"సాధనా!" ఆమె దుఃఖాన్ని సహించలేనివాడిలా అన్నాడు చైతన్య. "నువ్వనేదేమిటో నాకు అసలు అర్థం కావడం లేదు."

ఏదో స్ఫురించిన వాడిలా తండ్రి కూర్చున్న కుర్చీ వైపు చూశాడు. ఆయ నెప్పుడో జారుకున్నాడు. విసురుగా వంటింట్లోకి వెళ్ళాడు. వంటింట్లోంచిఅత్తగారి ఏడుపు, విస్కారం ధ్వనించే మాటలు వినిపించాయి సాధనకు.

నీరసపడి పోయాడు చైతన్య. సాధన తనని నమ్ముతుందా? ఎంత మోసగాడుగా చిత్రించుకుందో? తండ్రి తన ఆదర్శం తెలిసే ఇంత నాటకమాడతాడని కల గన్నాడా తను. ఇప్పటి దాకా చెప్పలేదు. తల్లికి కోపంవచ్చింది తను నిలదీస్తుంటే! "అడ్డాలనాడే గాని గడ్డాలొచ్చాక కాదురా బిడ్డలు. నీ బాగుకోరి తీసుకున్నాం ఆదాక ఆచారంగా అనే కాని, నీ మీద కక్షతో కాదురా. నువ్వు మీ నాన్నగార్ని ఒక్క మాటన్నా నా మీద ఒట్టే!"

ముందు కాళ్ళకి బంధం వేసింది తల్లి. వాళ్ళ మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తను క్షమించగలడు. కాని, సాధన దృష్టిలో తనెంత నీచుడయాడు?

అందుకా ఆరు నెలలుగా సాధనలో మార్పు కనిపిస్తోంది. తను గ్రహించ లేకపోయాడు.


అయినా ఇప్పు డీ విపత్తును ఎదుర్కోవడమెలా? మీరు కట్నం అడక్కండి అని ఏ మొహం పెట్టుకుని అడుగుతాడు బావమరిదినీ, అత్త మామలనీ?

నిర్మల కూడా అనంత్‌ను తప్ప ఎవర్నీ చేసుకోనని మొండికేసి కూర్చుంది. నిర్మల బాధ తనర్థం చేసుకోగలడు. మన సిచ్చిన మనిషిని వదులుకోవాలంటే .. ?సాధన గురించి తనెంత ఆరాట పడ్డాడు.

"భగవాన్!" తల పట్టుకున్నాడు చైతన్య.

భర్తను చూసి మనస్సు వెనక్కి లాగినా, కోపం తగ్గలేదు సాధనకు—వీళ్ళకి తగిన శాస్తి కావలిసిందే' అనుకుంది.

పూర్వోత్తరపు లంకంత ఇల్లు తనఖా పెడుతుంటే కన్నీరు తొణికిన లాడింది మామగారి




భర్త కళ్ళల్లో. ఏం అవస్థలు ఇంకా పడ్డారో మొత్తానికి కట్నం డబ్బు ముందే చేతిలో పోశారు అనంత్‌కి.

పెళ్ళి, ఆర్భాటం అన్నీ సవ్యంగా ముగిశాక సాధనకు తగని జాలేసింది చైతన్య మీద.

"ఏం, సాధనా! నా మీద కోపం పోలేదా ఇంకా? నిర్మల పెళ్ళయి పోయింది. ఇంకా కుసుమ పెళ్ళి, వేణు చదువు. ఎన్ని బాధ్యత లున్నాయో మన మీద. అమ్మా నాన్న పెద్దవాళ్ళు. చాందసులు. వాళ్ళని క్షమించలేవా?" లాలనగా భర్త దగ్గరకు తీసుకుంటూంటే తన మీద తనకే అసహ్య మేసింది సాధనకు. భర్త మీదే పగ సాధించింది. ఇదీ ఒక సంస్కారమేనా? భర్తకుతెలియకుండా అత్తమామలు కట్నం తీసుకున్నారని తనకి పెళ్ళిలో కాని తెలియలేదు. చైతన్య చెప్పలేదుకూడా.

ఏం మాట్లాడ లేకపోయింది సాధన.

"ఏమిటోయ్—పెళ్ళయింది వాళ్ళ కయితే మధ్య ఇప్పుడునువ్వు సిగ్గు పడుతున్నావ్! ఏదీ ఇటుచూడు."

ఆమె తడిసిన కనురెప్ప లెత్తి చూసింది.

కంగారు పడ్డాడు చైతన్య. "ఛీ ఏడుస్తున్నావా? ఎందుకు? ఇదిగో నీ కేం తెచ్చానో చూడు." కవరు చేతిలో పెట్టాడు. విప్పి చూసి అచేతనురాలైంది సాధన. పది వేలకు చెక్కు!

"ఏంటిది?" నోట్లోనే ఉండిపోయింది ప్రశ్న.

"నీ కట్నం సొమ్ము. బీదవాడిని—వడ్డీ ఇచ్చుకోలేను, సాధనా?"

"ఏమండీ!" ఏడ్చేసింది బేలగా.

"ఛీ! ఊరుకో. ఇందులో తప్పేముంది? నీ పేర ఉన్నా అది మనిద్దరి సొమ్మేగా! ఇంతకంటే నీ కోపం ఎలా పోగొట్టాలో నాకు తెలియలేదు, సాధనా" భారంగా అన్నా డతను.

"అంటే మీకే నా మీద కోపం పోలేదన్న మాట.

"చ! అదేం కాదు."

"మరయితే నా కెందు కిచ్చినట్టు? సరే ఇది తీసుకుంటున్నాను. మరి మీరుకూడా నా మాట వినాలి."

"నీ మాట కాదన్న దెప్పుడు, దేవీ."

"గొప్పే కాని, ఈ పది వేలతో మనింటి మీద అప్పు కొంత తీర్చేయండి. నేనుకూడా ఉద్యోగంలో చేరతాను. మీ జీతంతో ఇల్లు గడుపుతూ, నా జీతంతో అప్పు తీర్చేద్దాం. సరేనా?"

"పాతికేళ్ళ క్రితం పెళ్ళయిన ఆరిందాలా చెబుతున్నావ్, సాధనా. నువ్వెంత మంచిదానివి. నిన్నింక మోసం చెయ్యను బాబూ! నా బావమరిదికి ద్రోహం చేసినట్టయినా ఫరవాలేదు కాని, నిజం చెప్పేస్తాను. అనంత్ అన్నట్టు నువ్వు నిజంగా అమాయకురాలివి."

"నిజమా? ఏ నిజం?"

"అవును, సాధనా? నీ పట్టుదల తీర్చడం కోసమే అనంత్ కట్నం తీసుకున్నాడు. కాని నే నెంత చెప్పినా వినకుండా పాతిక వేలు మళ్ళీ నా చేతిలో పెట్టేశాడు.

• • • •

"అక్కయ్య పిచ్చిది అమాయకురాలు బావగారూ! తన ఆదర్శం నెరవేరలేదనే పట్టుదల, పిచ్చి కోపమే కాని దాని కేం తెలియదు. మీ రవన్నీ మనసులో పెట్టుకుని అక్కయ్యను..."

"అనంత్."

"అవును బావగారూ. అక్కయ్యది చాలా సున్నితమైన మనస్తత్వం. ఆనందం వచ్చినా ఆవేశం వచ్చినా పట్టలేదు. మీ రీ డబ్బుతో ఇల్లు తనఖా విడిపించేయండి. కానీ మీకు వడ్డీ నష్టం."

"సాధనను మోసం చేసినందుకు ఆ కాస్త శిక్ష కూడా లేకపోతే ఎలా? అయినా ఇచ్చినా డబ్బు తిరిగి తీసు..."

"మీ రింకేం మాట్లాడకండి. లోకం దృష్టిలో కట్నం తీసుకున్న వాడని పేరు పడినా, నా ఆదర్శం నాకూ ఉంది. కట్నానికి నేనూ వ్యతిరేకినే. అయితే అక్కయ్యను నొప్పించలేక... మీరు మాత్రం అక్క మీద కోపం తెచ్చుకోకండి."

"సాధన నా ప్రాణం అనంత్. ఆమెను ఎంతో ఇష్టపడి ఏరి కోరి చేసుకున్నాను. సరే మరి మీ అమ్మా, నాన్నా..."

"బావగారూ! వాళ్ళ విషయం నా కొదిలేయండి. మీకు మాత్రం ఒక్క షరతు. మీ రీ విషయాలేవీ అక్కకు చెప్పకండి."

"అలాగే."

• • • •

"కానీ సాధనా! మన కుటుంబం కోసం నువ్వు ఉద్యోగం చేస్తానని అంతబాధ్యత తీసుకుంటూంటే" ఆమెను దగ్గరకు తీసుకోబోయాడు చైతన్య.

"ఆగండి! బావా మరదు లిద్దరూ కలిసి నన్ను ఫూల్ చేస్తారా?" కోపం నటించింది సాధన.

"పోనీలేవోయ్! శిక్ష వెయ్. పాపం నీ ఆదర్శం నెరవేరింది కాదు. పోనీ నీ కొడుకు విషయంలో నెరవేర్చు కుందువుగానిలే. నీకు పూర్తి స్వాతంత్ర్య మిచ్చేశాను. నేను ఆ విషయంలో చిటికిన వేలు కూడా పెట్టను." ఆమె పొట్ట వైపు చూశాడు.

అక్కడనుంచి పారిపోయింది సాధన మొహంలో ఎరుపును దాచుకోవడానికి. *